స్థానిక సంస్థల ఎన్నికలకు సన్నద్ధం కావాలి

అదనపు కలెక్టర్ నగేశ్

మెదక్, ఫిబ్రవరి 12 (నమస్తే తెలంగాణ) : సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ సభ్యుల ఎన్నికల నిర్వహణను సమర్థవంతంగా నిర్వహించేందుకు సన్నద్ధం కావాలని అదనపు కలెక్టర్ నగేశ్ సూచించారు. ఈ మేరకు కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో రిటర్నింగ్, సహాయ రిటర్నింగ్, అధికారులు, ఎంపీడీవోలు, ఎంపీవోలు, డీఎల్‌పీవోల, అధికారులకు మొదటి దశ శిక్షణ తరగతులను బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అదనపు కలెక్టర్ నగేశ్ ముఖ్య అతిథిగా హాజరై అధికారులకు పలు సూచనలు చేశారు. జిల్లాలోని 492 గ్రామపంచాయతీల్లో 190 ఎంపీటీసీ స్థానాలు, 21 జడ్పీటీసీ స్థానాలకు, ఎంపీపీ-21, సర్పంచ్ స్థానాలు-492, వార్డు సభ్యులు-4220 ఎన్నికలు నిర్వహించడానికి ముందస్తుగానే అన్ని రకాల ఏర్పాట్లు పూర్తి చేసుకోవాలన్నారు. ఎలాంటి వివాదాలు, తప్పిదాలకు తావులేకుండా ముందుకు సాగాలని సూచించారు. నోటిఫికేషన్ జారీ చేసి

సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ నగేశ్

మండల పరిషత్ కార్యాలయాల్లో నామినేషన్ల ప్రక్రియను చేపట్టాల్సి వస్తుందని తెలిపారు. తదుపరి అన్ని రకాల ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలన్నారు. బ్యాలెట్ పేపర్‌ను అభ్యర్థుల పేర్లపై తెలుగు అక్షర మాల క్రమ పద్ధతిలో ముద్రించాల్సి ఉంటుందని వివరించారు. నోటిఫికేషన్ జారీ అయినప్పటి నుంచి ప్రతిరోజూ రిపోర్టును అందించాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో జడ్పీ సీఈవో ఎల్లయ్య, డీపీవో యాదయ్య, డీఆర్డీవో పీడీ శ్రీనివాసరావు, జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి, ఎంపీడీవోలు, ఎంపీవోలు, డీఎల్‌పీవోలు పాల్గొన్నారు.

హాజరైన ఆయా శాఖల అధికారులు

మాజీ ఎమ్మెల్యే పరామర్శ

బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి

రామాయంపేట, ఫిబ్రవరి 12 : రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు దివంగత సయ్యద్ సలాఉద్దీన్ కుటుంబాన్ని మెదక్ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు పద్మాదేవేందర్‌రెడ్డి పరామర్శించారు. బుధవారం మృతుడి స్వగృహానికి వెళ్లి బాధిత కుటుంబాన్ని ఓదార్చారు. మాజీ ఎమ్మెల్యే వెంట మాజీ ఎంపీపీ భిక్షపతి, ఎంపీటీసీ సిద్దిరాంరెడ్డి, ఉమామహేశ్వర్, శ్యాములు, చిట్టిమల్లి నరేందర్‌రెడ్డి, శ్రీకాంత్ సాగర్, శ్రావణ్‌గౌడ్, రాంకి, శ్రీకాంత్, బబ్లు తదితరులు ఉన్నారు.

దశదిన కర్మకు హాజరైన మాజీ ఎమ్మెల్యే

మెదక్, ఫిబ్రవరి 12 (నమస్తే తెలంగాణ) : హవేళీఘనపూర్ మండలం సర్దన గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సోషల్ మీడియా వారియర్ రాజేశ్వరరావు తండ్రి సర్వోత్తమ్ రావు ఇటీవల మృతి చెందాడు. బుధవారం సర్వోత్తమ్ రావు దశదిన కర్మ కార్యక్రమానికి మెదక్ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు పద్మాదేవేందర్‌రెడ్డి హాజరై ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆమె వెంట బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు దేవేందర్ రెడ్డి, మాజీ జడ్పీ వైస్ చైర్మన్ లావణ్య రెడ్డి, హవేళీఘనపూర్ మండలాధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ రాధాకృష్ణ యాదవ్, నాయకులు సతీశ్ రావు, సత్యవర్ధన్ రావు, మ్యాకల సాయిలు, రామచంద్రారెడ్డి, నరేందర్ రెడ్డి, సాప సాయిలు, వినయ్, రంజిత్, లడ్డు నాయక్ తదితరులు ఉన్నారు.

పరామార్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి

ఆర్థిక సాయం

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న నేతలు

రామాయంపేట, ఫిబ్రవరి 12 : అనారోగ్యానికి గురై మృత్యువాత పడిన బాధిత కుటుంబానికి మెదక్ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు పద్మాదేవేందర్‌రెడ్డి ఆర్థికసాయం పంపించారు. బుధవారం ప్రగతి ధర్మారం గ్రామానికి చెందిన బ్యాగరి చంద్రవ్వ ఇటీవల ఆనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే ప్రగతి ధర్మారం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్తల ద్వారా రూ.5 వేలు బాధిత కుటుంబానికి అందజేశారు. మాజీ ఎంపీటీసీ సిద్దిరాంరెడ్డి, సంతోశ్ రెడ్డి, సుధాకర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ఇసుక టిప్పర్ పట్టివేత

వెల్దుర్తి, ఫిబ్రవరి 12 : మండల కేంద్రమైన వెల్దుర్తి పట్టణ శివారు హల్దీవాగులో నుంచి రాత్రి వేళల్లో అక్రమంగా ఇసుకను తరలిస్తున్న టిప్పర్‌ను పట్టుకుని వెల్దుర్తి పోలీసులు కేసు నమోదు చేశారు. తూప్రాన్ సీఐ రంగ కృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. వెల్దుర్తి శివారు గంగమ్మ దేవాలయం సమీపంలో నుంచి మంగళవారం రాత్రి చిన్న టిప్పర్‌లో ఇసుకను తరలిస్తున్నారన్న సమాచారంతో వెల్దుర్తి పోలీస్ సిబ్బందితో కలిసి దాడి చేశారు. ఇసుకను తరలిస్తున్న టిప్పర్‌ను పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. టిప్పర్ డ్రైవర్‌తో పాటు ఓనర్‌పై కేసు నమోదు చేశామని తెలిపారు. హల్దీవాగులో నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, సంబంధిత వ్యక్తులపై కేసులు నమోదు చేస్తామని వెల్లడించారు.

మహిళలు నిర్భయంగా ముందుకు రావాలి

ఆన్‌లైన్ కౌన్సెలింగ్‌లో పాల్గొన్న జిల్లా అదనపు ఎస్పీ మహేందర్

మెదక్ అర్బన్, ఫిబ్రవరి 12 : మహిళలు మౌనం వీడి, నిర్భయంగా ముందుకు వచ్చి వేధింపుల నుంచి బయటపడాలని జిల్లా అదనపు ఎస్పీ మహేందర్ సూచించారు. బుధవారం తెలంగాణ రాష్ట్ర ఉమెన్ సేఫ్టీవింగ్ ద్వారా నిర్వహించిన ఆన్‌లైన్ కౌన్సెలింగ్‌కు జిల్లా అదనపు ఎస్పీ మహేందర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు భయంలేకుండా ఫిర్యాదు చేయాలని ఫిర్యాదు వివరాలు గోప్యంగా ఉంచబడతాయని పేర్కొన్నారు. మహిళలు, బాలికలను వేధింపులకు గురిచేసిన 72 మంది ఈవ్‌టీజర్స్ ఆన్‌లైన్ కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. షీ టీమ్స్ ఎళ్లవేళలా అందుబాటులో ఉండి సేవలు అందిస్తాయని తెలిపారు.

పాఠశాలలను పరిశీలించిన జిల్లా విద్యాధికారి

రేగోడ్, ఫిబ్రవరి 12 : పాఠశాలలను జిల్లా విద్యాధికారి రాధాకిషన్ పరిశీలించారు. ఆయన రేగోడ్‌లోని జిల్లా పరిషత్ పాఠశాల, ప్రాథమిక పాఠశాల కస్తూర్బా బాలికల పాఠశాలను బుధవారం సందర్శించారు. ప్రాథమిక పాఠశాల, కస్తూర్బా పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉపాధ్యాయులు సమయ పాలనను పాటించాలని హెచ్చరించారు. సెక్రటరియల్ ఆఫీసర్ సుదర్శన మూర్తి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జిల్లాపరిషత్ పాఠశాలలో విద్యాబోధనను పరిశీలిస్తున్న డీఈవో రాధాకిషన్

పల్లె దవాఖానకు కుర్చీలు, ఫ్యాన్లు వితరణ

మండల కేంద్రమైన చేగుంటలో పల్లె దవాఖానకు జిల్లా వాలీబాల్ అసోసియేషన్ అయిత పరంజ్యోతి 4 కుర్చీలు, ఫ్యాన్ల ను బుధవారం అందజేశారు. ఏఎన్ఎం జ్యోతి, కాలనీవాసులు గడ్డమీది రఘుపతి, సులబోయిన రఘుపతి, లక్ష్మణ్, శివకుమార్, కృష్ణ, మల్లమ్మ, అంగన్‌వాడీ టీచర్ సుగుణ, ఆశ వర్కర్లు, పల్లె దవాఖాన సిబ్బంది, కాలనీ వాసులు ఉన్నారు.

-చేగుంట, ఫిబ్రవరి 12

కర్నాల్‌పల్లి ఎల్లమ్మ ఆలయంలో కత్తి కార్తీక పూజలు

చేగుంట, ఫిబ్రవరి 12 : చేగుంట మండలం కర్నాల్‌పల్లి ఎల్లమ్మ దేవాయంలో దుబ్బాక బీఆర్ఎస్ మహిళ నాయకురాలు కత్తి కార్తీకగౌడ్ బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సాయిబాబా దేవాలయ వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొని పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ జనగామ రాములుగౌడ్, వంటరి అశోక్‌రెడ్డి, బాలేశంగౌడ్, కొత్త దేవిరెడ్డి, అనిల్‌గౌడ్, వెంకట్‌రెడ్డి,రాజు, స్వామి, కామోజీ, అనురాధ తదితరులు ఉన్నారు.

ఆలయంలో పూజలు చేస్తున్న కత్తి కార్తీకగౌడ్

మార్షల్ ఆర్ట్స్‌లో పతకాలు

మెదక్ మున్సిపాలిటీ, ఫిబ్రవరి 12 : హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో మంగళవారం జరిగిన అండర్-14 అంతర్జాతీయ అల్ స్టైల్స్ మార్షల్ ఆర్ట్స్ చాంపియన్ షిప్-2025 పోటీల్లో మెదక్ పట్టణంలోని ఫతేనగర్ యూపీఎస్ పాఠశాలకు చెందిన విద్యార్థులు లాస్య రజత పతకం, రిత్విక్ కాంస్య పతకం సాధించినట్లు పాఠశాల వ్యాయమ ఉపాధ్యాయుడు నవీన్ బుధవారం తెలిపారు. ఉపాధ్యాయులు అభినందించారు.

చెరువులో పడి బాలిక మృతి

తూప్రాన్, ఫిబ్రవరి 12: ఆడుకుంటూ చెరువులో పడి ఓ బాలిక మృతి చెందిన సంఘటన తూప్రాన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. వివరాల ప్రకారం.. తూప్రాన్ పట్టణానికి చెందిన చాంద్ పాషా, పర్వీన్ దంపతులకు పాప, బాబు సంతానం. బుధవారం ఉదయం తల్లి పర్వీన్‌తో కలిసి కుమార్తె అయిన జుబేరియా (6) తూప్రాన్ పెద్ద చెరువు వద్ద బట్టలు ఉతికేందుకు వెళ్లింది. ఈ క్రమంలో జుబేరియా ఆడుకుంటూ చెరువులో పడి మృతి చెందింది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సిద్దిపేట ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో సదస్సు

సిద్దిపేట, ఫిబ్రవరి 12 : సిద్దిపేట ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో బుధవారం గణిత శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో పోటీ పరీక్షలకు గణితంలో మెళకువలు, అర్థమెటిక్ అండ్ రీజనింగ్ అనే అంశాలపై కార్యశాల నిర్వహించారు. గణితశాస్త్ర ఉపన్యాసకులు ఎన్. వీణ, స్వామి, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ శ్యామ్, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ స్రవంతి, జంతు శాస్త్ర సహాయ ఆచార్యులు డాక్టర్ శ్వేత మాట్లాడారు. కార్యక్రమంలో రాజనీతి శాస్త్ర సహాయచార్యులు డాక్టర్ సామ సువర్ణదేవి, చరిత్ర ఉపన్యాసకులు సంతోష్ కుమార్, ప్రసాద్ పాల్గొన్నారు.

ఎంపీటీసీ ఓటరు జాబితా విడుదల

రామాయంపేట, ఫిబ్రవరి 12 : మరి కొన్ని రోజుల్లోనే స్థానిక సంస్థల ఎన్నికలు రాబోతున్నాయని గ్రామీణ ప్రాంత ప్రజలు తమ ఓటు హక్కును సద్వినియోగం, చేసుకోవాలని రామాయంపేట ఎంపీడీవో షాజులుద్దీన్ అన్నారు. బుధవారం రామాయంపేట పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో సిబ్బంది ఓటరు జాబితాను అతికించారు. అనంతరం ఎంపీడీవో మాట్లాడుతూ రామాయంపేట మండల వ్యాప్తంగా 16 గ్రామ పంచాయతీల పరిధిలోని 7 ఎంపీటీసీ స్థానాలు ఉన్నాయన్నారు. అక్కన్నపేట, ప్రగతి ధర్మారం, దామరచెర్వు, కాట్రియాల, కోనాపూర్, లక్ష్మాపూర్, రాయిలాపూర్ స్థానాలకు త్వరలోనే ఎంపీటీసీ ఎన్నికలు జరుగుతాయన్నారు. ఏడు ఎంపీటీసీ స్థానాలకు 9350



ఎంపీటీసీల ఓటరు జాబితాను కార్యాలయంలో అతికిస్తున్న ఎంపీడీవో, సిబ్బంది

మంది పురుషులు, 10355మంది మహిళా ఓటర్లు మొత్తం 19705 మంది ఓటర్లు ఉన్నారని అన్నారు. ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును సద్వినియోగం చేకోవాలన్నారు.

హామీలను కాంగ్రెస్ అమలు చేయాలి

టేక్మాల్‌లో బీఆర్ఎస్ క్యాలెండర్‌ను ఆవిష్కరించిన పార్టీ శ్రేణులు

టేక్మాల్, ఫిబ్రవరి 12 : సీఎం రేవంత్‌రెడ్డి అసమర్థతతో రాష్ట్రంలో పాలన గాడి తప్పిందని, ఇచ్చిన హామీలను అమలు చేయలేని దుస్థితిలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉందని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు భక్తుల వీరప్ప ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల కేంద్రమైన టేక్మాల్‌లో బుధవారం బీఆర్ఎస్ నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో 420 హామీలను ఇచ్చిన కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక వాటిని అమలు చేయలేని నిస్సహాయ స్థితిలో ఉందన్నారు. రైతు పెట్టుబడి కోసం ఇవ్వాల్సిన రైతు భరోసాను ఇప్పటికీ వేయకపోవడంతో పంట పెట్టుబడికి రైతులు అప్పులు చేయాల్సిన దుస్థితి నెలకొందన్నారు. కేసీఆర్‌ను విమర్శించే స్థాయి ఇచ్చిన హామీలను నేరవేర్చలేని రేవంత్‌రెడ్డికి లేదన్నారు. నాయకులు బసంత రావు, సిద్ధయ్య, భాస్కర్, రవి, సాయిలు, సుధాకర్, కిషన్, రమేశ్ నాయక్, మోహన్, సంగయ్య, శ్రీనివాస్, సురేశ్, సాయిబాబా, జయవర్ధన్, బాలకృష్ణ ఉన్నారు.

సంత్ రవిదాస్‌కు నివాళి

రామాయంపేట, ఫిబ్రవరి 12 : రామాయంపేట పట్టణంలోని మహంకాళీ ఆలయంలో సంత్ రవిదాస్ జయంతి ఘనంగా నిర్వహించారు. బుధవారం 648వ జయంతి సందర్భంగా సంత్ రవిదాస్ చిత్రపటానికి పట్టణ మోచి సంఘం పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ సంత్ రవిదాస్ చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో సమరసత జిల్లా నాయకుడు బైరం నర్సింహులు, మోచి సంఘం కుల పెద్దలు పాల్గొన్నారు.

సంత్ రవిదాస్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నేతలు

పెండింగ్ పనులు పూర్తి చేయాలి

చిన్నశంకరంపేట, ఫిబ్రవరి 12 : గ్రామాల్లో చేపడుతున్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీడీవో దామోదర్ ఈజీఎస్ సిబ్బందికి సూచించారు. బుధవారం చిన్నశంకరంపేట పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బంది సమీక్షలో మాట్లాడారు. గ్రామాల్లో నీటి సమస్య తలెత్తకుండా చూడాలని, ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. పారిశుద్ధ్యం లోపించకుండా చూడాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీవో రాజ్‌కుమార్, ఆయా గ్రామాల పంచాయతీ, కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంపీడీవో దామోదర్

డిజిటల్ బోధనపై అవగాహన కలిగి ఉండాలి

చిలిపిచెడ్, ఫిబ్రవరి 12 : ప్రభుత్వ పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయులు డిజిటల్ బోధనపై అవగాహన కలిగి ఉండాలని చిట్కుల్ పాఠశాల హెచ్ఎం ప్రభాకర్ తెలిపారు. బుధవారం మండల కేంద్రమైన చిలిపిచెడ్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ డిజిటల్ విద్యకు విద్యార్థులకు అర్థమయ్యే భాషల్లో తరగతులు నిర్వహించాలని తెలిపారు. కార్యక్రమంలో ఆయా పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అవగాహన కలిపిస్తున్న హెచ్ఎం ప్రభాకర్

బధ్రియ తండాలో తాగునీటి ఎద్దడి

చిలిపిచెడ్, ఫిబ్రవరి 12 : తాగునీటి కోసం తిప్పలుతప్పడం లేదు.. చిలిపిచెడ్ మండలంలోని బధ్రియ గిరిజన తండాలో మహిళలు తాగు నీటి కోసం వ్యవసాయ బోరు బావులను ఆశ్రయించాల్సిన దుస్థితి నెలకొన్నది. తండాలో కొన్ని రోజులుగా మిషన్ భగీరథ నీరు రాకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. తాగు నీటి కోసం తండా వాసులు నానా తంటాలు పడుతున్నారు. ఎండాకాలం దృష్టిలో పెట్టుకొని ఇప్పటికైనా అధికారులు స్పందించి తండావాసులకు తాగునీటిని అందించాలని ప్రజలు కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో కానిస్టేబుల్‌కు తీవ్రగాయాలు

నిజాంపేట, ఫిబ్రవరి 12 : రోడ్డు ప్రమాదంలో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్‌కు తీవ్రగాయాలైన సంఘటన నిజాంపేటలో బుధవారం చోటు చేసుకుంది. నిజాంపేట పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ నాగరాజు బైక్‌పై రోడ్డు దాటుతున్న క్రమంలో రామాయంపేట నుంచి సిద్దిపేట వైపు వెళ్తున్న కారు అతివేగంగా వచ్చి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కానిస్టేబుల్ నాగరాజు తీవ్రగాయాలు కాగా, దవాఖానకు తరలించారు. అతివేగమే ప్రమాదానికి కారణమని ఎస్సై శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.

స్థానిక సంస్థల ఎన్నికల నుంచి మినహాయింపు ఇవ్వాలి

మెదక్ మున్సిపాలిటీ, ఫిబ్రవరి 12 : త్వరలో జరిగే ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో స్టేజ్-2 అధికారులుగా మహిళలకు మినహాయింపు ఇవ్వాలంటూ బుధవారం జిల్లా విద్యాశాఖాధికారి రాధాకిషన్‌కు ఎస్టీయూ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రాజగోపాల్ గౌడ్, పోచయ్య వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏడాది వయస్సు గల పిల్లల తల్లులకు, దివ్యాంగులకు, దీర్ఘకాలిక వ్యాధితో బాధపడే వారితో పాటు 6 నెలల లోపు ఉద్యోగ విరమణ పొందే వారికి ఎన్నికల విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

డీఈవోకు వినతిపత్రం అందజేస్తున్న ఎస్టీయూ నాయకులు



కర్నాల్‌పల్లిలోని షిర్డీసాయిబాబా దేవాలయంలో భక్తులకు అనుగ్రహ బాషణ చేస్తున్న మాధవానంద స్వామి.

-చేగుంట,ఫిబ్రవరి12

కడుపునొప్పితో వివాహిత ఆత్మహత్య

నిజాంపేట, ఫిబ్రవరి 12 : కడుపు నొప్పి భరించలేక వివాహిత ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని చల్మెడలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన సంగోళ్ల వినోద (32) రెండు నెలల నుంచి కడుపునొప్పితో బాధపడింది. ఈ క్రమంలో మంగళవారం రాత్రి కడుపునొప్పి మరింత తీవ్రతరం కావడంతో భరించలేక ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. బుధవారం మృతురాలు అత్తమ్మ రాజవ్వ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.

మత్స్యకారుల వలలో చిక్కిన కొండచిలువ

రామాయంపేట, ఫిబ్రవరి 12: రామాయంపేట మండలం రాయిలాపూర్ గ్రామంలోని మత్స్యకారుల వలలో పెద్ద కొండ చిలువ చిక్కిన సంఘటన బుధవారం జరిగింది. మత్స్యకారుల కథనం ప్రకారం.. ఎప్పటిలాగే గ్రామానికి చెందిన మత్స్యకారులు మంగళవారం రాత్రి గ్రా మానికి చెందిన పెద్ద చెరువులో చేపల కోసం వలలు వేశారు. బుధవారం ఉదయం రామాయంపేట మార్కెట్ ఉండడంతో చెరువులో నుంచి వలలు తీసే క్రమంలో ఒక వలలో పొడవాటి సుమారు ఐదు మీటర్ల పొడవు ఉన్న కొండ చిలువ చిక్కింది. దీంతో తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. వలలో చిక్కడంతో కొండ చిలువకు బయటకు రాకుండా ఉండడంతో వలలోనే మృత్యువాత పడింది. మృతి చెందిన కొండ చిలువను గుంతతీసి పూడ్చివేశారు.

మత్స్యకారులకు చిక్కిన కొండచిలువ

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
GOLD FINANCE
★మీ బంగారం మణప్పురం, ముత్తూట్, మార్వాడీ షాప్స్, ఏ ఇతర ఫైనాన్స్‌లో ఉన్నా, మా డబ్బుతో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును. 9160077916. స్పాట్ క్యాష్.
NT-337308
గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

కారు ఢీ కొని వ్యక్తి మృతి

రాయపోల్, ఫిబ్రవరి 12 : గుర్తు తెలియని వాహనం ఢీ కొని వ్యక్తి మృతి చెందిన సంఘటన రాయపోల్ మండలంలోని అంకిరెడ్డిపల్లి గ్రామ బస్టాండ్ సమీపంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని వీరానగర్ గ్రామానికి చెందిన జాలిగామ ఐలయ్య (35) వ్యవసాయంతో పాటు కూలీ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అంకిరెడ్డిపల్లి గ్రామంలోని హార్ట్‌వేర్ వేర్ షాపులో సిమెంట్ లారీ లోడ్ ఖాళీ చేయడానికి దినసరి కూలీగా వెళ్లాడు. సిమెంట్ ఖాళీ చేసిన తర్వాత షాపు నుంచి నడుచుకుంటూ వెళ్తుండుగా అతివేగంతో వచ్చిన కారు వెనకాల నుంచి ఐలయ్యను బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో కారు ఆపకుండా వెళ్లిపోయాడు. స్థానికులు, కుటుంబ సభ్యులు అక్కడికి చేరుకొని బాధిత కుటుంబానికి తగిన న్యాయం చేయాలని కోరుతూ మృతదేహాన్ని రోడ్డుపై ఉంచి అందోళన చేశారు. ఈ విషయం తెలుసుకున్న ఎస్సై రఘుపతి,సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకున్నారు. తొగుట సీఐ లతీఫ్ ప్రమదానికి కారణమైప కారు యజమాని వివరాల కోసం విచారణ చేపట్టగా, వర్గల్ మండలం నెంటూర్ గ్రామానికి చెందిన గౌరయ్యగారి ప్రకాశ్‌గౌడ్‌గా గుర్తించారు. వెంటనే అతనిపై కేసు నమోదు చేస్తామని హామీ ఇవ్వడంతో అందోళన విరమించారు. మృతదేహాన్ని గజ్వేల్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు.

మీసేవ కేంద్రాల ఆకస్మిక తనిఖీ

మెదక్, ఫిబ్రవరి 12 (నమస్తే తెలంగాణ) : మీ సేవ కేంద్రాల ద్వారా పౌరులకు ఉత్తమ సేవలు అందాలని ఈడీఎం సందీప్ తెలిపారు. బుధవారం జిల్లాలోని మీసేవ కేంద్రాలను ఆకస్మిక తనిఖీ నిర్వహించి పౌరులకు అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలక్ట్రానిక్ సర్వీస్ డెలివరీ కమిషనర్ ఆదేశాల మేరకు జిల్లాలోని మీ సేవ కేంద్రాలను పరిశీలించి సమర్థ నిర్వహణకు తగు సూచనలు చేశామని, పౌరులు దగ్గర అదనపు చార్జీలు వసూలు చేయకుండా నిబంధనలకు అనుగుణంగా వ్యవహరించాలని సూ చించామన్నారు. మీసేవ కేంద్ర సేవలు అత్యంత పారదర్శకంగా నిర్వహించాలని వివరించినట్లు చెప్పారు. కార్యాలయ సిబ్బంది శశికాంత్ ఉన్నారు.

మీ సేవ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఈడీఎం సందీప్

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
Telangana Today
FOR LOCAL TO GLOBAL NEWS
పుట్టినరోజు, పదవీ విరమణ, వార్షికోత్సవ శుభాకాంక్షలు, వర్ధంతి, జయంతి, లీగల్ నోటీసులు మరియు ఇతర ప్రకటనల కొరకు ఈ దిగువ తెలిపిన నెంబర్లపై సంప్రదించగలరు.
ప్రకటనల విభాగం సెల్: 80966 77655
సిద్దిపేట/గజ్వేల్/తూప్రాన్/మెదక్ : 80966 77663
సంగారెడ్డి/జహీరాబాద్/నారాయణఖేడ్ : 9182777658
పటాన్‌చెరు : 80966 77657